క్లుప్తంగా

ఆత్మీయ సత్కారం



మాజీ ఎమ్మెల్యే వెంకట నాగేశ్వరరావును శాలువతో సత్కరిస్తున్న భూమన

తిరుపతి మంగళం : వైఎస్సార్‌సీపీ మాజీ మంత్రి, ఎమ్మెల్సీ బొత్సా సత్యనారాయణ, మాజీ ఎమ్మెల్యే కారుమూరి వెంకట నాగేశ్వరరావును ఆ పార్టీ రాష్ట్ర అధికార ప్రతినిధి భూమన కరుణాకరరెడ్డి ఆత్మీయ సత్కారం చేశారు. తిరుపతికి విచ్చేసిన వారు మంగళవారం తిరుపతి పద్మావతిపురంలోని భూమన కరుణాకర రెడ్డిని ఆయన నివాసంలో మర్యాదపూర్వకంగా కలిశారు. అనంతరం వారిని భూమన ఆలింగనం చేసుకుని సత్కరించారు.

గ్యాస్ యాజమాన్యం దోపిడీపై ఫిర్యాదు

పాకాల: ఈకేవైసీలో వేలుముద్ర పెట్టకపోతే ఉచితంగా గ్యాస్ రాదని మభ్యపెట్టి స్థానిక విశ్వనాథ గ్యాస్ ఏజెన్సీ నిర్వాహకులు వినియోగదారుల నుంచి అదనంగా రూ.60 నుంచి రూ.100 వరకు వసూలు చేశారని, అలాగే గ్యాస్ సిలిండర్ల డోర్ డెలివరీలో ప్రతిసారీ రూ.35 నుంచి 40 వరకు అదనంగా గుంజుతున్నారని మంగళవారం వినియోదారుల హక్కుల పరిరక్షణ సమితి సభ్యులు తహసీల్దార్ నిత్యానందబాబుకు ఫిర్యాదు చేశారు. ఈ దోపిడీ, అక్రమాలపై విచారణ చేసి గ్యాస్ యాజమాన్యంపై చర్యలు తీసుకోవాలని కోరారు. కార్యక్రమంలో ప్రెసిడెంట్ ముని ప్రభాకర్, చిత్తూరు డివిజన్ అధ్యక్షుడు కలికిరి నారాయణస్వామి, జనార్ధన్‌నాయుడు తదితరులు పాల్గొన్నారు.

'మహిళల్లోనే మానసిక రుగ్మతలు ఎక్కువ'

తిరుపతి సిటీ: దేశంలో పురుషుల కంటే మహిళలే ఎక్కువగా మానసిక రుగ్మతల బారిన పడుతున్నారని, పద్మావతి మహిళా వర్సిటీ మహిళా అధ్యయన కేంద్రం ప్రాజెక్ట్ అసోసియేట్ డాక్టర్ చైతన్య అన్నారు. మంగళవారం వర్సిటీ హ్యూమానిటీ బ్లాక్ సెమినార్ హాల్‌లో మహిళా అధ్యాయన కేంద్రం, సైకాలజి విభాగం సంయుక్తంగా ప్రపంచ మానసిక ఆరోగ్య దినోత్సవాన్ని నిర్వహించాయి. 'పని ప్రదేశాలలో మానసిక ఆరోగ్యం–ప్రాముఖ్యత' అనే అంశంపై బోధనేతనర సిబ్బందికి చైతన్య అవగహన కల్పించారు. కార్యక్రమంలో ఉమెన్ స్టడీస్ సెంటర్ డైరెక్టర్ ప్రొఫెసర్ సి.వాణి, స్విమ్స్ సైకియాట్రీ విభాగం డాక్టర్ గణేష్ కుమార్, వర్సిటీ బోధనేతర సిబ్బంది పాల్గొన్నారు.

బీజేపీ సంబరాలు



సంబరాలు చేసుకుంటున్న బీజేపీ నాయకులు

తిరుపతి క్రైం: హర్యానా రాష్ట్రంలో బీజేపీ హ్యాట్రిక్ విజయం సాధించడంపై మంగళవారం బీజేపీ జిల్లా సాంస్కృతిక విభాగం అధ్యక్షులు గుండాల గోపీనాథ్ రెడ్డి ఆధ్వర్యంలో స్థానిక గోవిందరాజస్వామి మాడవీధిలో నాయకులు టపాకాయలు కాల్చి స్వీట్లు పంచిపెట్టారు. బీజేపీ నాయకులు సుబ్రహ్మణ్యంయాదవ్, కట్టమంచి చంద్రబాబు యాదవ్, తొండమనాటి సుబ్రహ్మణ్యంరెడ్డి, జయంత్ కుమార్, పనిభూషణరెడ్డి, రాజశేఖర్‌రెడ్డి, సుధాకర్ పాల్గొన్నారు.

కాంగ్రెస్ కూటమి గెలుపుపై సంబరాలు



తిరుపతిలో కాంగ్రెస్ నాయకుల సంబరాలు

తిరుపతి(అలిపిరి): జమ్మూ కాశ్మీర్ ఎన్నికల ఫలితాల్లో కాంగ్రెస్ కూటమి ఘన విజయం సాధించడంపై తిరుపతిలో మంగళవారం ఆ పార్టీ శ్రేణులు రాజీవ్ గాంధీ విగ్రహం వద్ద బాణసంచా కాల్చి స్వీట్లు పంచాయి. కార్యక్రమంలో కాంగ్రెస్ నాయకులు యార్లపల్లి గోపి, రవి, అమీజ్ మజీద్ పటేల్, తేజోవతి, ముని శోభ, హసీనా బేగం, వెంకటేష్ గౌడ్ తదితరులు పాల్గొన్నారు.

క్రీడారంగంపై ప్రత్యేక దృష్టి



కలెక్టర్‌ను కలసిన శాప్ చైర్మన్

తిరుపతి అర్బన్: ఆంధ్రప్రదేశ్ క్రీడాప్రాధికార సంస్థ(శాప్) క్రీడారంగం అభివృద్ధికి ప్రత్యేక దృష్టి సారిస్తుందని ఏపీ శాప్ చైర్మన్ అనిమిని రవినాయుడు పేర్కొన్నారు. మంగళవారం కలెక్టరేట్‌లో ఆయన కలెక్టర్ డాక్టర్ ఎస్ వెంకటేశ్వర్‌ను మర్యాదపూర్వకంగా కలిసి మాట్లాడారు. రాష్ట్ర ప్రభుత్వం క్రీడారంగానికి పెద్దపీట వేస్తోందని, దీనిలో భాగంగా మంత్రి లోకేష్ పీపీపీ విధానాన్ని అమలు చేస్తున్నారన్నారు. తిరుపతి, విజయవాడ, కాకినాడ, విశాఖపట్నం ఏరియాల్లో క్రీడారంగాన్ని అభివృద్ధి చేయాలనేది శాప్ లక్ష్యమన్నారు. తిరుపతి జిల్లాలో శాప్‌కు 38 ఎకరాలు అవసరముందని, శ్రీనివాస స్పోర్ట్స్ కాంప్లెక్సును అభివృద్ధి చేసేందుకు స్మార్ట్ సిటీ నుంచి కూడా నిధులను కేటాయించాలని కోరారు. తిరుపతి జిల్లాను కబడ్డీ, హాకీ క్లబ్‌గా తీర్చిదిద్దాలని మంత్రి లోకేష్ భావిస్తున్నారన్నారు.

కిక్ కప్పం కట్టాల్సిందే..!

- నూతన మద్యం పాలసీల్లో 17 దుకాణాలకు అనుమతి
- మన చంద్రగిరి..మన సిండి'కేటు'
- తన పాలసీనే పాటించాలని ప్రజాప్రతినిధి హుకుం
- సిండికేట్‌లో భాగమవ్వాలని ఒత్తిడి
- నాన్ రీ'ఫండ్' మిగుల్చుకునేందుకు ఎత్తుగడ
- దుకాణం దక్కినా సిండికేట్‌కు సమర్పణ తప్పనిసరి
- అనుభవం ఉన్న మద్యం వ్యాపారులకు నో ఛాన్స్



చంద్రగిరి ఎక్సైజ్ పోలీసు స్టేషన్

తిరుపతి, టాస్క్‌ఫోర్స్: నూతన మద్యం పాలసీ కింద చంద్రగిరి ఎక్సైజ్ సర్కిల్ పరిధిలో మొత్తం 17 మద్యం దుకాణాలకు టెండర్లు ఆహ్వానించారు. తిరుపతికి దగ్గరగా ఉండటం, ప్రైమ్ ఏరియా కావడంతో ప్రభుత్వానికి భారీ ఆదాయం సమకూరుతుందని ఎక్సైజ్ అధికారులు భావించారు. కానీ ఇప్పటి వరకు వచ్చిన టెండర్లను చూసి ఖంగుతుంటున్నారు. 'కప్పం కట్టండి.. దరఖాస్తు చేసుకోండి' అని ప్రజాప్రతినిధి కార్యాలయం అల్టిమేటం ఇవ్వడం, దరఖాస్తుదారులు సిండికేటులో కలవాలని వార్నింగ్ ఇచ్చింది. టెండరు వేసే వారందరినీ సిండికేట్ చేసి చివర్లో మద్యం దుకాణాలకు తక్కువ టెండర్లు వేయడం ద్వారా నాన్ రీఫండబుల్ రూ.2లక్షల ఖర్చు తగ్గించుకోవచ్చునని ప్లాన్ చేసినట్టు సమాచారం. సిండికేటైతే ఎవరికి లాటరీ తగిలినా దుకాణం తమకే వస్తుందని ప్రజాప్రతినిధి అనుచరగణం స్కెచ్ వేసినట్టు భోగట్టా. దీంతో ఎన్నో ఏళ్లుగా మద్యం వ్యాపారం చేస్తున్న వారు సిండి'కేటుగాళ్ల' తీరును చూసి తర్జనభర్జన పడుతున్నట్టు తెలుస్తోంది.

17 దుకాణాలకు 57 దరఖాస్తులు

చంద్రగిరి, పాకాల, చిన్నగొట్టిగల్లు, యర్రావారిపాళ్యం మండలాలకు సంబంధించి ప్రభుత్వం 17 దుకాణాలకు అనుమతించింది. ఈ క్రమంలో అధికార పార్టీ నాయకులు ఒత్తిళ్లతో దరఖాస్తులు చేసుకునేందుకు ఆశావాహులు వెనకడుగు వేసినట్లు సమాచారం. దీంతో చంద్రగిరిలో 10 దుకాణాలకు 31, పాకాలలో 5 దుకాణాలకు 5, చిన్నగొట్టిగల్లులో 3 దుకాణాలకు 10, యర్రావారిపాళ్యంలో 2 దుకాణాలకు 11 దరఖాస్తులు మాత్రమే వచ్చినట్లు అధికారిక లెక్కలు చెబుతున్నాయి. వాస్తవంగా ప్రతి దుకాణానికి 10 చొప్పున మొత్తం 170 దరఖాస్తులు వస్తాయని అధికారులు భావించారు. అయితే అధికార పార్టీ నేతల ఒత్తిళ్లతో 57 దరఖాస్తులు మాత్రమే రావడం చూస్తే ఆదాయానికి భారీగా గండి పడుతున్నట్టు స్పష్టమవుతోంది.

హడావుడిగా దరఖాస్తులు

మంగళవారం సాయంత్రం చంద్రగిరి ఎక్సైజ్ కార్యాలయాన్ని జిల్లా డిప్యూటీ కమిషనర్ విజయ్ శేఖర్, ఎక్సైజ్ సూపరింటెండెంట్ నాగమల్లేశ్వర్ రెడ్డి తనిఖీ చేస్తున్నారని అధికార పార్టీ నాయకులకు ముందుగా సమాచారం చేరడంతో హడావుడిగా సిండికేట్లు దరఖాస్తులు చేసినట్లు తెలుస్తోంది. ఇప్పటికే నియోజకవర్గంలోని నాలుగు మండలాలకు నామమాత్రపు దరఖాస్తులు వచ్చాయని, ఇలా అయితే ప్రభుత్వం నుంచి తమ చీవాట్లు తప్పవని అధికార పార్టీ నేతల వద్ద ఆ శాఖ అధికారులు వాపోయినట్టు సమాచారం.

తిరుపతి రూరల్‌లో ఆన్‌లైన్ దెబ్బ

తిరుపతి రూరల్ ఎక్సైజ్ సర్కిల్ పరిధిలో తిరుపతి రూరల్ :12, రేణిగుంట మండలం: 10 చొప్పున ప్రభుత్వం మద్యం దుకాణాలను మంజూరు చేసింది. ఇక్కడ కూడా సిండికేట్లు చక్రం తిప్పాలని చూశారు. రూరల్ సర్కిల్ పరిధిలో 22 దుకాణాలకు కేవలం 39 మాత్రమే ఆఫ్‌లైన్ దరఖాస్తులు వచ్చాయి. మరోవైపు 220కు పైగా వివిధ ప్రాంతాల నుంచి ఆన్‌లైన్‌లో దరఖాస్తులు రావడం అధికారులకు ఉత్సాహాన్నిచ్చింది. ఆన్‌లైన్‌లో దరఖాస్తులు వెల్లువెత్తడం, జిల్లాలోనే అత్యధికంగా రూరల్ మండలంలో ఇలా రావడంతో అధికార పార్టీ నేతలకు మింగుడు పడటం లేదు. సిండికేట్‌కు స్కెచ్ వేసిన నేతలు ఆన్‌లైన్ దరఖాస్తుదారుల కతేమిటో చూడాలని భావిస్తున్నట్టు సమాచారం.

బ్రహ్మోత్సవాల్లో నేడు



తిరుమల: తిరుమలలో అంగరంగ వైభవంగా నిర్వహిస్తున్న సాలకట్ల బ్రహ్మోత్సవాలలో ఆరవ రోజు బుధవారం ఉదయం హనుమంత వాహనంపై ఊరేగుతారు, రాత్రి గజ వాహనంపై స్వామివారు విహరిస్తూ భక్తులను కటాక్షిస్తారు. సాయంత్రం స్వర్ణ రథం (రథరంగ డోలోత్సవం) ఊరేగింపు నిర్వహిస్తారు.

హంస వాహనంపై వీణాపాణి





సరస్వతీ అలంకరణలో హంస వాహనంపై విహరిస్తున్న మూలస్థాన ఎల్లమ్మ, శ్రీదుర్గాదేవి అలంకరణలో శ్రీసంతోషి మాత



శ్రీలక్ష్మీదేవి అలంకరణలో దర్శనమిస్తున్న తాతయ్యగుంట గంగమ్మ



భాకరాపేట: కరెన్సీనోట్ల అలంకరణలో మహాలక్ష్మి అమ్మవారు

చంద్రగిరి: చంద్రగిరి గ్రామ దేవత శ్రీమూస్థాన ఎల్లమ్మదేవి నవరాత్రి ఉత్సవాల్లో భాగంగా మంగళవారం రాత్రి సరస్వతీ దేవి అవతారంలో అమ్మవారు హంస వాహనంపై పురవీధుల్లో విహరిస్తూ భక్తులకు అభయమిచ్చారు. ఉదయం మూలవిరాట్‌తో పాటు అష్టలక్ష్మీదేవతలు, నాగదేవత, నవగ్రహదేవతలకు ప్రత్యేక పూజలు నిర్వహించారు.

ఒంటి వంశస్థులు, తిరుపతికి చెందిన జయచంద్రారెడ్డి, మొండికాలువకు చెందిన త్రిమూర్తి రెడ్డి, రవిచంద్రారెడ్డి, వేపారెడ్డి కుటుంబ సభ్యులు ఉభయదాతలుగా వ్యవహరించారు. ఉత్సవ కమిటీ చైర్మన్ మొక్కల చంద్రశేఖర్ రెడ్డి, ఆలయ ఈవో మమత, సిబ్బంది, భక్తులు పాల్గొన్నారు. అలాగే, కొత్తపేట ఆర్‌ఎఫ్ రోడ్డులోని శ్రీశ్యామలాంబ సమేత మల్లేశ్వరాలయం(పుట్టాలమ్మ)లో శ్రీసంతోషి మాతా ఆలయంలో అమ్మవారు దుర్గాదేవి అవతారంలో భక్తులకు దర్శనమిచ్చారు.

శ్రీలక్ష్మీదేవి అలంకరణలో గంగమ్మ

తిరుపతి కల్చరల్: శ్రీతాతయ్యగుంట గంగమ్మ మంగళవారం సాయంత్రం శ్రీలక్ష్మీదేవి అలంకరణలో భక్తులకు దర్శనమిచ్చారు. ఆలయంలో ఉదయం అమ్మవారికి అభిషేకం, దేవి హోమం, సహస్రనామార్చన నిర్వహించారు. అనంతరం సాయంత్రం అమ్మవారిని శ్రీలలితా త్రిపుర సుందరిదేవి అలంకరణలో కొలువు తీర్చి భక్తులకు దర్శన భాగ్యం కల్పించారు. ఆలయ ఈవో ఏ.జయకుమార్, ఆలయ అర్చకులు, సిబ్బంది, భక్తులు పాల్గొన్నారు.

మహాలక్ష్మిగా తిరుపతి గంగమ్మ

భాకరాపేట: చిన్నగొట్టిగల్లులోని చెరువు కట్టపై ఉన్న తిరుపతి గంగమ్మ, భాకరాపేటలోని శ్రీ వాసవీ కన్యకా పరమేశ్వరి అమ్మవారు మంగళవారం మహాలక్ష్మి అవతారంలో భక్తులకు దర్శనమిచ్చారు.

భగవద్గీత జ్ఞానంతో ఆదర్శ జీవితం



కర్తవ్య బోధ గీత పుస్తకాన్ని ఆవిష్కరిస్తున్న అతిథులు, రచయిత

తిరుపతి కల్చరల్: ఆదర్శవంతమైన జీవితం గడపడానికి కావలసినంత జ్ఞానమంతా భగవద్గీతలో ఉందని హిందూ ధర్మప్రచార పరిషత్ కార్యక్రమ నిర్వహణాధికారి డాక్టర్ పగడాల నారాయణ అన్నారు. విశ్రాంత ఉపకులపతి ఆచార్య కూతాటి వెంకటరెడ్డి రచించిన ' కర్తవ్యబోధ గీత' పుస్తకాన్ని మంగళవారం స్థానిక ఎస్వీ నగర్‌లోని రచయిత స్వగృహంలో ఆవిష్కరించారు. ఆయన మాట్లాడుతూ, యువత ఆధునిక జ్ఞానంతో పాటు ఆధ్యాత్మిక జ్ఞానాన్ని పెంపొందించుకోవాలన్నారు. ఎస్వీ డబ్ల్యూ కాలేజీ విశ్రాంత ప్రిన్సిపల్ చిత్రపు స్వరాజ్యలక్ష్మి, రొటేరియన్ డాక్టర్ కోరా వెంకటాచలపతి మాట్లాడారు. వెంకటరెడ్డి 1991లో పదవీ విరమణ అనంతరం 26 పుస్తకాలు రచించారన్నారు. కార్యక్రమంలో తిరుపతి జిల్లా రచయితల సంఘం అధ్యక్షుడు సాకం నాగరాజు, ప్రసారభారతి విశ్రాంత కార్యనిర్వాహక అధికారి డాక్టర్ కె.విజయ, రైజ్ డైరెక్టర్ రామకృష్ణ, ఎస్వీ ఆర్ట్స్ కళాశాల విశ్రాంత ప్రిన్సిపల్ కె.అప్పస్వామి పిళ్లై, విశ్రాంత ఆచార్యులు ఎం సీ.రెడ్డెప్పరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

సాంసంగ్ కార్మికులకు సీఐటీయూ సంఘీభావం



ఎయిర్ బైపాస్ రోడ్డులోని సాంసంగ్ షోరూం వద్ద నిరసన వ్యక్తం చేస్తున్న సీఐటీయూ నేతలు

తిరుపతి కల్చరల్: తమిళనాడు రాష్ట్రం శ్రీపెరంబుదూరులో సాంసంగ్ కార్మికులు తమ సమస్యలు పరిష్కరించాలని చేస్తున్న సమ్మెకు సంఘీభావంగా మంగళవారం సీఐటీయూ ఆధ్వర్యంలో తిరుపతిలోని సాంసంగ్ డీలర్‌షిప్‌లు, షోరూంల ముందు నిరసన సీఐటీయూ నాయకులు నిరసన వ్యక్తం చేశారు. సీఐటీయూ జిల్లా అధ్యక్షుడు జి.బాలసుబ్రమణ్యం మాట్లాడుతూ, సాంసంగ్ ఇండియా ఎలక్ట్రానిక్స్ ప్లాంట్‌లో వేలాది కార్మికులను అర్ధాంతరంగా తొలగించారని, వారి స్థానంలో రోబోట్లతో పనిచేయిస్తామని యాజమాన్యం ప్రకటించడం దారుణమన్నారు. దీనిపై రాష్ట్ర కార్మిక శాఖ మంత్రులు, సీఎం స్టాలిన్ చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో సీఐటీయూ జిల్లా నేతలు జయచంద్ర, ఆర్.లక్ష్మి, టి.సుబ్రమణ్యం, పి.బుజ్జి, మునిరాజా, చిన్న, వాసు, వెంకటయ్య, బాదుల్లా, రఘుబాబు, గురవమ్మ పాల్గొన్నారు.

టీటీడీ విజిలెన్స్ అధికారుల నిజాయితీ



పోగొట్టుకున్న నగలు, నగదును భక్తురాలికి అప్పగిస్తున్న టీటీడీ విజిలెన్స్ అధికారులు

చంద్రగిరి (తిరుచానూరు): అమ్మవారి దర్శనార్థం వచ్చిన భక్తులు పోగొట్టుకున్న నగదు, నగలను తిరిగి భక్తురాలికి అప్పగించి టీటీడీ విజిలెన్స్ అధికారులు తమ నిజాయితీని చాటుకున్నారు. ఈ ఘటన తిరుచానూరు ఆలయంలో చోటు చేసుకుంది. వివరాలు..మధ్యప్రదేశ్‌కు చెందిన సరస్వతి ఠాగూర్ అమ్మవారి దర్శనార్థం మంగళవారం క్యూలో వెళ్తున్న సమయంలో లగేజి కౌంటర్ వద్ద తన హ్యాండ్ బ్యాగును మరచిపోయింది. అక్కడే విధుల్లో ఉన్న సిబ్బంది దీనిని గుర్తించి అధికారులకు సమాచారం చేరవేశారు. సీసీ టీవీ ఫుటేజీ ఆధారంగా భక్తురాలి గుర్తించారు. బ్యాగులో ఉన్న రూ.16,440, రెండు గోల్డ్ రిస్ట్ వాచ్‌లు, రెండు జతల చెవి కమ్మలు, రెండు ఉంగరాలను భక్తురాలికి అప్పగించారు.

'ఏకలవ్య' విద్యార్థుల ప్రతిభ



విద్యార్థులను అభినందిస్తున్న ప్రిన్సిపల్ ధర్మేంద్రసింగ్

బుచ్చినాయుడుకండ్రిగ: అల్లూరి సీతారామరాజు జిల్లాలోని అరకువాలీలోని ఏకలవ్య గురుకుల పాఠశాలలో నిర్వహించిన ఈఎంఆర్ఎస్ స్టేట్ లెవెల్ కల్చరల్ ఫెస్ట్‌లో మండలంలోని ఏకలవ్య ఆదర్శ గురుకుల పాఠశాల విద్యార్థులు ప్రతిభ చాటారు. రాష్ట్రంలోని 28 ఏకలవ్య గురుకుల పాఠశాల విద్యార్థులు ఈ పోటీలకు హాజరయ్యారు. వీరిలో కనమనంబేడు ఏకలవ్య గురుకుల పాఠశాల నుంచి 30 విద్యార్థులు వివిధ విభాగాల్లో పాల్గొని, ఆరు విభాగాల్లో బహుమతులు సాధించారని ప్రిన్సిపల్ ధర్మేంద్రసింగ్ తెలిపారు.

● తరించితిమి స్వామీ!



గరుడోత్సవ సేవలో టీటీడీ అధికారులు, జిల్లా కలెక్టర్, రాజకీయ నాయకులు, ప్రముఖులు – తిరుమల

గోవిందా.. ఈ కష్టాలు చూడవయ్యా..!

- బ్రహ్మోత్సవాల్లోనూ రెండే కౌంటర్లలో టికెట్లు ఇస్తున్న వైనం!
- టికెట్ల కోసం ప్రయాణికుల తోపులాటలు



ఏడు కొండల బస్టాండులో టికెట్ల కోసం క్యూలలో భక్తుల రద్దీ

తిరుపతి అర్బన్: గరుడోత్సవంలో శ్రీవారిని చూసి తరించాలని వచ్చిన భక్తులతో తిరుపతి భక్త జన సంద్రమైంది. పెద్ద సంఖ్యలో భక్తులు వస్తారని అంచనా వేసినప్పటికీ, దానికి తగ్గట్టు తిరుపతి ఏడుకొండల బస్టాండులో టికెట్ కౌంటర్లను ఏర్పాటు చేయకపోవడం భక్తుల పాలిట శాపమైంది. టికెట్ల కోసం క్యూలలో పడిగాపులు, తోపులాటలు తప్పలేదు. దీంతో అధికారుల తీరుపై భక్తులు మండిపడ్డారు. గత ఏడాది బ్రహ్మోత్సవాల సమయంలో ఏడుకొండల బస్టాండులో 8 కౌంటర్లు, అలిపిరి బస్టాండులో 7కు పైగా టికెట్టు కౌంటర్లు ఏర్పాటు చేసిన అధికారులు ఈ ఏడాది సాధారణ రోజులలో ఇచ్చే రెండు కౌంటర్లు మినహా ప్రత్యేక కౌంటర్లు ఏర్పాటు చేయకపోవడం భక్తులకు అగచాట్లు తప్పలేదు. ఆర్టీసీ బస్టాండులో టికెట్ల కోసం బారులు తీరారు. తోపులాటలు, అరుపులు కేకలు మిన్నంటాయి. దీంతో టికెట్లు తమకు దక్కడం కష్టతరమని భావించిన భక్తులు విధిలేక తిరుమలకు వెళ్లేందుకు ప్రైవేటు వాహనాలను ఆశ్రయించారు. దీంతో ప్రైవేటు ఆపరేటర్లు మూడింతలు రేట్లు పెంచి దండుకున్నారు.

పట్టించుకోని అధికార యంత్రాంగం

కళ్ల ముందే భక్తులు బస్సు టికెట్ల కోసం అవస్థలు పడుతున్నా ఆర్టీసీ, టీటీడీ అధికారులు చేతులెత్తేశారు. పలువురు భక్తులు అధికారులకు కలిసి నిలదీసినా ఫలితం శూన్యం. దీంతో వారిపై ఆగ్రహం వ్యక్తం చేస్తూ భక్తులు వెనుదిరిగారు.

టికెట్ కౌంటర్లు పెంచకపోవడం దారుణం

“ గరుడోత్సవం రోజున తిరుమలకు వెళ్లే భక్తులకు అధికారులు నరకం చూపించారు. ఆర్టీసీ బస్టాండులో రెండే కౌంటర్లలో టికెట్లు ఇస్తున్నారు. ఇలా గతంలో ఎన్నడూ చూడలేదు. పసిబిడ్డలు, వృద్ధులు టికెట్లకోసం తోపులాటలో కింద పడినా అధికారులు ప్రేక్షకపాత్ర వహించారు. బ్రహ్మోత్సవాల ఏర్పాట్లు దారుణంగా ఉన్నాయి.

– వెంకటేశన్, భక్తుడు, తమిళనాడు

టీటీడీ, ఆర్టీసీ అధికారులు విఫలం

గరుడ సేవకు స్థానిక భక్తులు పెద్ద ఎత్తున చేరుకుంటారనే ఇంగిత జ్ఞానం సైతం అధికారులు లేకపోవడం ఆశ్చర్యమేస్తోంది. కేవలం రెండు కౌంటర్లలోనే టికెట్లు ఇవ్వడం దారుణం. 20ఏళ్లలో ఎప్పుడూ ఇలాంటి పరిస్థితి చూడలేదు. స్థానిక డ్రైవర్లు కొందరు తమ సొంత వాహనాలలో అధిక ధరలు వసూళ్లు చేసి భక్తులను తిరుమలకు చేర్చారు.

– గురునాథం, స్థానికుడు, తిరుపతి

కార్మికులపై దాడులను అరికట్టాలి

తిరుపతి కల్చరల్: యాజమాన్యాలు కార్మికులపై చేస్తున్న దాడులను కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు అరికట్టాలని ఆంధ్రప్రదేశ్ మెడికల్ అండ్ సేల్స్ రెప్రజెంటేటివ్స్ యూనియన్ రాష్ట్ర కార్యదర్శి రామకృష్ణ డిమాండ్ చేశారు. యూనియన్ 58వ ఆవిర్భావ దినోత్సవాన్ని మంగళవారం సుందరయ్యనగర్‌లోని కమ్యూనిటీ హాల్లో నిర్వహించారు. యూనియన్ జిల్లా అధ్యక్షుడు శ్రీనివాసులు జెండా ఆవిష్కరించారు. పలువురు నాయకులు మాట్లాడారు. ఎన్నో పోరాటాలతో సాధించుకున్న కార్మిక చట్టాలను కేంద్ర ప్రభుత్వం రద్దు చేసి లేబర్ కోడ్లు తీసుకురావడం దుర్మార్గమన్నారు. అలాగే యాజమాన్యాలు డిజిటలైజేషన్ తీసుకొచ్చి కార్మికులపై విపరీతమైన పని భారం మోపుతున్నాయని, దీనికి తోడు యాజమాన్యాల దాడులు మరింత పెరగడంతో సేల్స్ రెప్రజెంటేటివ్స్ తట్టుకోలేక మృతి చెందుతున్నారని పేర్కొన్నారు. కార్యక్రమంలో యూనియన్ జిల్లా కార్యదర్శి కిరణ్, రాష్ట్ర కమిటీ సభ్యుడు ఆనంద్, డీవైఎఫ్ఐ జిల్లా కార్యదర్శి నరేంద్ర, యూనియన్ నేతలు రవీంద్రారెడ్డి, ముఖేష్, రాజేష్, రాజగోపాల్, మహేష్ పాల్గొన్నారు.

నీ సేవకు వచ్చితిమయ్యా..!



గరుడోత్సవ సేవకు వచ్చిన భక్తులతో తిరుమల జనసంద్రమైంది. మంగళవారం సాయంత్రం గరుడ సేవ అయితే ఉదయానికే భక్తు లు పెద్ద సంఖ్యలో ఇక్కడికి వచ్చారు. పిల్లలు, కుటుంబ సభ్యులతో సహా గ్యాలరీలకు చేరుకున్నారు. భానుడు చుర్రుమనిపిస్తున్నా లెక్కచేయక భక్తులు గొడుగులు చేతపట్టి, గోవింద నామస్మరణ చేస్తూ గడిపారు. వస్త్రాలను పరదాల్లా కట్టి వాటి నీడలో సేదదీరారు. సాయంత్రం స్వామివారిని వీక్షించి పులకించారు.

– తిరుమల